క్లుప్తంగా

నేడు నడిగూడెం మండలంలో ఎమ్మెల్యే పద్మావతి పర్యటన

నడిగూడెం : మండలంలో శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి పర్యటించనున్నట్లు పీఆర్‌ఓ వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాపురంలో సహకార సంఘం గోదామును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, సిరిపురంలో రామాలయం, రంగనాయకస్వామి ఆలయ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారంలో పాల్గొని అనంతరం కాగితరామచంద్రాపురంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే

మోతె : మండలంలోని నర్సింహాపురం గ్రామంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు శుక్రవారం ఎమ్మెల్యే పద్మావతి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు, పోలీసులు

చిలుకూరు : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామ పరిధిలో గల బీసీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై షీటీమ్ సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ఈ షీటీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి



వెంకట్‌రెడ్డిని సీపీఐలోకి ఆహ్వానిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ గిన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి తిరిగి తన మాతృ సంస్థ సీపీఐలో చేరారు. గురువారం పట్టణంలో ఆయనకు సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు సీపీఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ నాయకులు యల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, జడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



విద్యుత్ ఉపకేంద్రం గురించి విద్యార్థులకు వివరిస్తున్న సిబ్బంది

నడిగూడెం : మండల కేంద్రంలోని కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఆన్‌ద జాబ్ శిక్షణలో భాగంగా గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉప కేంద్రానికి.. అక్కడి నుంచి గ్రామాలకు విద్యుత్ సరఫరా, పరికరాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ నాయక్, వృత్తి విద్య కోర్సుల అధ్యాపకులు కె.శ్రీధర్, సీహెచ్.కృష్ణ, బి.మహేష్, డి.వీరన్న, మదార్, నగేష్, ధనుంజయ్, నాగరాణి, హేమ, శైలజ, మణి, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ విద్యాసాగర్, ల్యాబ్ టెక్నీషియన్ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



వేర్ హౌజ్ గోదాము గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

నేరేడుచర్ల : ఒకేషనల్ కోర్సు విద్యార్థులు ప్రతి ఏడాది నిర్వహించే ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సు చేస్తున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గురువారం నేరేడుచర్లలోని వేర్ హౌజ్ కార్పొరేషన్ గోదామును సందర్శించారు. ఈ సందర్భంగా వేర్ హౌజ్‌లో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, శ్రీనివాసులు, వెంకన్న, వీరునాయక్, ప్రసాద్, అపర్ణ ఉన్నారు.

మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

- ఈదురుగాలులు, వర్షానికి నేలవాలుతున్న పొలాలు
- పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- చేనుపైనే 80 శాతం వరి

కోదాడరూరల్ : వాతావరణంలో గత వారం రోజులుగా వచ్చిన మార్పులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేలపైనే ఉండడంతో వర్షం పడితే పంట దెబ్బతిని నష్టం వాటిల్లుతుంది. దీంతో రైతన్నలు ఆకాశంలోని మబ్బులను చూసి గుబులు చెందుతున్నారు.కోదాడ నియోజకవర్గంలో నియోజకవర్గంలో లక్ష ఇరవై నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. కాగా ఇప్పటికే వరి కోతలు ప్రారంభమైనప్పటికీ 20 నుంచి 30 శాతం వరకు కోతలు పూర్తి అయ్యాయి. 80 శాతం పంట ఇంకా చేనుపైనే ఉంది. అయితే ఇప్పటికే ఈదురుగాలులు, వానాలకు పలు గ్రామాల్లో పంట నేలవారింది. కాగా, ఈ సీజన్‌లో రైతులు ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి సాధిస్తున్నారు. కానీ ఈదురుగాలులు, వర్షం పడుతుండటంతో పంట నేలకొరిగి ఐదారు బస్తాల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నేలవాలిన వరి పంట

5 ఎకరాలు నేలవాలింది



ఇటీవల వీచిన ఈదురు గాలులకు నేను సాగు చేసిన 5 ఎకరాలకు పైగా వరిపంట నేలవాలింది. దీంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. పంట చేతికొచ్చే సమయంలో గాలి, వాన తీవ్ర నష్టం మిగిల్చింది. కష్టపడి పండించిన పంట నేలపాలు కావడం బాధగా ఉంది.

– మేకపోతుల చిన్న అంజయ్య, కౌలు రైతు, కేఆర్పీపురం

నేలవాలిన పంటలు.. రైతులకు కష్టాలు

చిలుకూరు : మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి పలు చోట్ల వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో నేలకొరిగిన వరిని రైతులు కట్టలు కట్టుకుంటున్నారు. మరో 15 నుంచి 20 రోజుల్లో పొలాలకు కోతకు వస్తాయని, అప్పటివరకు పొలాలను కాపాడుకోవాలని రైతులు అంటున్నారు. ఒక్కరోజు కురిసిన వర్షానికి వరి పొలాలు నేలకొరిగి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షానికి నేలవాలిన వరి పొలాలను అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



దూదియాతండాలో నేలవాలిన వరిని కట్టలుగా కడుతున్న మహిళా రైతు

అవగాహనతో క్యాన్సర్‌ను నివారించొచ్చు

నడిగూడెం : అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని నడిగూడెం పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ తెలిపారు. గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. ప్యాక్ చేసిన ఫుడ్, ప్లాస్టిక్, డిస్పోజబుల్ ప్లేట్లు, కవర్లు, గ్లాసుల్లో ఆహారాన్ని తీసుకోవడం, పొగాకు వాడకం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, పల్లెదవాఖాన సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు సునీత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పల్లెదవాఖాన వైద్యాధికారి హరినాథ్

టేకు చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుంటాం

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని పత్తేపురం వద్ద టేకు చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఎస్పీ డీఈ అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పత్తేపురం గ్రామ రెవెన్యూ శివారులో గల ఎన్ఎస్పీ కాలువపై క్లోం బ్రదర్స్ ఏర్పాటు చేసిన హైడ్రో పవర్ ప్లాంటును గురువారం ఫారెస్ట్ అధికారి ఆనంద్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నెస్పీ భూముల్లో గల టేకు చెట్లు నరికినట్లు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. చెట్లను నరికి విక్రయించిన పవర్ ప్లాంటు యజమానితో పాటు వాటిని కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు. వారి వెంట ఇరిగేషన్ ఏఈ సతీష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లేష్, బీట్ ఆఫీసర్ ప్రదీప్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ఎన్ఎస్పీ కాలువపై ఉన్న హైడ్రో పవర్ ప్లాంటును పరిశీలిస్తున్న అధికారులు

సోషలిస్ట్ సమాజం నిర్మించడమే అమరులకు నివాళి



అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



అమరవీరుల స్థూపం వద్ద పార్టీ జెండా ఎగురవేస్తున్న కాకి అజయ్

హుజూర్‌నగర్ : సోషలిస్ట్ సమాజాన్ని నిర్మించడమే అమరులకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గురువారం హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయం నుంచి వర్తక సంఘం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్తక సంఘ భవనంలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తొలుత ఎర్ర జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, ఎర్ర అఖిల్‌కుమార్, సయ్యద్ హుస్సేన్, అంబటి భిక్షం, వాస కరుణాకర్, లక్ష్మి, పావని, మరియమ్మ, సత్తమ్మ, రేష్మ, రజాక్, శ్రీను, లక్ష్మయ్య, భాస్కర్, మాలంబి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి..

పట్టణంలోని గ్రామిక భవన్‌లో అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, సీనియర్ నాయకుడు కాకి అజయ్, నాయకులు ఉదయగిరి, వి.నరసింహారావు, ఎం.చందర్‌రావు, మేకల కనకారావు, నూకల చంద్రం, గురవయ్య, లక్ష్మీనరసయ్య, అంజయ్య, సాంబయ్య, వెంకన్న, కోటయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోట కూరగాయలతో ఆరోగ్యం

గరిడేపల్లి : పెరటి తోటల్లో పండించే కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన 50 మంది మహిళలకు, రైతులకు పెరటి తోటల పెంపకంపై గురువారం శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా 15 రకాల కూరగాయల గింజల కిట్‌లను అందజేసి మాట్లాడారు. ఇంట్లో పండించే కూరగాయాలలో సూక్ష్మపోషకాలు, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయని, అవి మన శరీరానికి అవసరమన్నారు. పెరటి తోటల్లో పండించే కూరగాయలను మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా కూడా ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్.సుగంధి, ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్.నరేష్, మృత్తిక శాస్త్రవేత్త కిరణ్, సెరికల్చర్ శాస్త్రవేత్త మాధురి, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



మహిళకు కూరగాయల గింజల కిట్ అందజేస్తున్న శాస్త్రవేత్త

రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు పెంచాలి

హుజూర్‌నగర్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన రైస్ మిల్లు దినసరి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు గతంలో ఉన్న కూలిపై 50 శాతం పెంచాలని, అలవెన్సులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటమ్మ, గోపమ్మ, మంగమ్మ, ఆదెమ్మ, పద్మ, అంజమ్మ, చంద్రకళ, లింగమ్మ, భూలక్ష్మి, వీరమ్మ, రమణ, రాధా తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల గది



శిథిలావస్థలో రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గది

చిలుకూరు : మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గది శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. అయితే ఆ గది స్టాఫ్ రూమ్. కానీ అది శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు అందులోకి వెళ్లడం లేదు. దీంతో స్టాఫ్ రూం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి ఆ స్థానంలో నూతన గదులు నిర్మించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బీసీలను చైతన్యం చేస్తాం



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

హుజూర్‌నగర్ : రాజ్యాధికారం దిశగా బీసీలను చైతన్యం చేస్తామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 78 ఏళ్లుగా పరిపాలించిన పాలకులు బీసీలను మోసం చేశారని ఆరోపించారు. ఇక నుంచి ఒక్క బీసీలనే కాకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు మామిడి నరసయ్య, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి మహా పడిపూజ

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఆవరణలో మునగాల గ్రామ అయ్యప్ప భక్త కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 7.30 గంటలకు అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాపడిపూజలో భాగంగా అష్టదశ కలిశాభిషేకం, నారికేళ పూజ, అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మునగాల అయ్యప్పస్వామి ఆలయ మేల్‌శాంతి నరపనేని రామారావు తాంత్రిక గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాస్‌చారి గురుస్వామి విలేకరులకు తెలిపారు. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన భరత్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 18వ పడి అయ్యప్ప మాలధారులైన పెంటకొట్టు సురేష్ గురుస్వామి, బొబ్బిలి సంజీవరెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో నారికేళ పూజ నిర్వహించనున్నట్లు వివరించారు. మహోత్సవానికి మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు .

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో గల అన్నదాన వితరణ కేంద్రంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 180 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు. ఈ అన్నదానానికి మునగాల గ్రామానికి చెందిన చందా శ్రీనివాస్ –లక్ష్మీనర్సమ్మ దంపతులు, వల్లోజు నరసింహారావు –సునీత దంపతులు, నారాయణగూడెం గ్రామానికి చెందిన మూల శ్రీనివాసరెడ్డి –ఉమ దంపతులు సహకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్టు సురేష్, కొమ్ము ఈదారావు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

అక్రమంగా ఉంచిన పశువుల పట్టివేత

కోదాడ రూరల్ : పాడుబడ్డ గోదాంలో అక్రమంగా ఉంచిన 26 పశువులను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని దొరకుంటలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కోదాడకు చెందిన ఎండీ గులాం, షేక్ గౌస్ లు అక్రమంగా కొనుగోలు చేసిన పశువులను దొరకుంట గ్రామ శివారులోని ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఓ పాడుబడ్డ గోదంలో కట్టివేసి హైదరాబాద్‌లోని కబేలాకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. పక్కా సమాచారంతో కోదాడ రూరల్ పోలీసులు దాడి చేసి పశువులను పట్టుకున్నారు. వాటిని గోశాలకు తరలించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూల విరాట్ స్వామికి పంచ సూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నూతన పట్టువస్త్రాలతో స్వామిఅమ్మవార్లను అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సామిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌నారాయణ

కోదాడరూరల్ : సామిల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వెంకట్‌నారాయణ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సామిల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామిల్‌లో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యాలు పని గంటలను పెంచి వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఏడాది దీపావళికి చేసుకొనే నూతన అగ్రిమెంట్ నేటి వరకు అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో సామిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శేషయ్య, ముత్యాలు, కొండలు, గంటల శ్రీను, రమేష్, రాంబ్రహ్మం, ఖదీర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా నారాయణపురం రోడ్డు



నారాయణపురం వద్ద గూనల నుంచి వెళ్తున్న చెరువు నీరు



చెరువు కట్ట తెగి వస్తున్న నీరు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం నుంచి సీత్లాతండా వెళ్లే దారిలో నారాయణపురం చెరువు వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరదలకు నారాయణపురం చెరువు కట్ట తెగి రోడ్డు ధ్వంసమైంది. దీంతో అధికారులు అక్కడ తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. చెరువు నీరు రోడ్డు వైపు వెళ్లకుండా ఉండేందుకు చెరువులో కట్ట నిర్మించారు. కానీ ప్రస్తుతం చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో చెరువులోని కట్ట తెగి నీరు తాత్కాలిక రోడ్డు మధ్యలో వేసిన గూనల నుంచి దిగువకు వెళ్తున్నాయి. దీంతో రోడ్డు ఎప్పుడు తెగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.


సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కోదాడరూరల్ : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన విశ్రాంత ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉండగా.. ఒక డీఏ మాత్రమే ప్రకటించిందని, అది కూడా 17 వాయిదాల్లో ఇస్తామనడం బాధాకరమన్నారు. నగదురహిత వైద్యసేవలు అందించడంతోపాటు కమ్యూటేషన్ పెన్షన్ 135 నెలలకు తగ్గించాలనే రెండు ప్రధాన సమస్యలపై రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శరత్ బాబు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, బొల్లు రాంబాబు, సుబ్బయ్య, వేనేపల్లి శ్రీనివాసరావు, రఘుప్రసాద్, హమీద్‌ఖాన్, పాట్టా జగన్మోహన్ రావు, విద్యాసాగర్ ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న రిటైర్డు ఉద్యోగులు

ఎక్కడి చెత్త అక్కడే



బీసీ కాలనీలో సీసీ రోడ్డుపై చెత్త

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో రోడ్లపైనే చెత్త దర్శనమిస్తోంది. బీసీ కాలనీలో సీసీ రోడ్డుపైనే చెత్త పోస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు అంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కార్మికులతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నందున బూరుగడ్డ, కరక్కాయలగూడెం, గోపాలపురం, మర్రిగూడెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి రాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని పశువులకు శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతుల ఖాతాల్లో నగదు వెంటనే జమ చేయాలి



మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్‌రావు

గరిడేపల్లి : ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నగదును రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవనంలో నందిపాటి మట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 15వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శులు ఎస్‌కే యాకూబ్, నగేష్, తుమ్మల సైదయ్య, దోసపాటి భిక్షం, యానాల సోమయ్య, బోయిళ్ల అర్జున్, బొల్లిపల్లి శ్రీనివాస్, పటాన్ మైబెల్లి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ కో కన్వీనర్ అందే రాంబాబు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా జమ్మిగడ్డలోని బాబుజగ్జీవన్ భవన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు చింత సతీష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ. 6వేలు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత, గీత కార్మికులకు, బీడీ కార్మికులకు రూ. 4వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. కానీ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్‌దారులను మర్చిపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం కాసీం, జాతీయ నాయకులు కర్ల విజయరావు, రాష్ట్ర మహిళా నాయకురాలు రావి స్నేహలతచౌదరి, వికలాంగుల కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్‌బాబా, అధికార ప్రతినిధి పేరెల్లి బాబు, చింత సాంబయ్య పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సందర్శన

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎస్ఆర్ఎమ్ బ్రైట్ స్కూల్ విద్యార్థులు గురువారం పోస్టాఫీసును సందర్శించారు. ఈ సందర్భంగా 1, 2, 3వ తరగతి విద్యార్థులకు పోస్టాఫీస్ విధులు, ఉత్తరాల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.